ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

హుస్నాబాద్ టౌన్, మార్చి 15: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ హుస్నాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఈ దీక్ష ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కొలుగూరి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీక్షలో ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన గందుల లక్ష్మీనారాయణ, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బోయిని రాజశేఖర్, నాయకులు గడిపె చిన్నబాలు, కోతి వేందర్, కొమ్ముల సంపత్, ముత్యాల రామస్వామి, కొమ్ము వెంకటేశ్ పాల్గొన్నారు.

హుస్నాబాద్ టౌన్: దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేర్యాలలో నిరసన దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

చేర్యాలలో..

చేర్యాల, మార్చి 15: ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తర్వాతనే ఉద్యోగాల భర్తీ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ డివిజన్ ఇన్‌చార్జి సనవాల ప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తున్న ఉద్యోగాలను ఎస్సీ వర్గీకరణ అమలు జరిగే వరకు నిలిపివేయాలని డిమాం డ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష శనివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ముందే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ అమలు చేయకుండానే ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారని, దీంతో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దీక్షకు బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు కందుకూరి సిద్దిలింగం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, మధుకర్, బాల్‌నర్సయ్య, ఐలయ్య, శ్రీనివాస్, నర్సింహులు, రమేశ్, ముస్త్యాల కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్‌లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, మార్చి 15: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి రైతులకు సూచించారు. శనివారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, పండించిన పంటను కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు. క్వింటాల్ పొద్దు తిరుగుడుకు రూ.7280 మద్దతు ధర ఉందన్నారు. కేసీఆర్ హయాంలో గ్రామాల్లోని రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అనుకున్న సమయానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, పీఏసీఎస్ సీఈవో బాలయ్య, అధికారులు పాల్గొన్నారు.

సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

హుస్నాబాద్‌టౌన్, మార్చి 15: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్, సింగిల్‌విండో ఆధ్వర్యంలో జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పంటను తీసుకువచ్చి ప్రభుత్వం అందిస్తున్న (క్వింటాల్‌కు 7,280) మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ బంక చందు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వైస్ చైర్మన్ ఎగ్గిడి అయిలయ్య, సింగిల్ విండో సీఈవో తిరుమల, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.


హుస్నాబాద్‌టౌన్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేడం లింగమూర్తి

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడికి పరామర్శ

రాయపోల్, మార్చి 15: ఉమ్మడి రాయపోల్,దౌల్తాబాద్ మండలాల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కొత్తపల్లి గ్రామానికి చెందిన కర్నాల సత్యనారాయణ రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఆపోలో దవాఖానకు వెళ్లి సత్యనారాయణను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు.

కర్నాల సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

కటికె కిషన్ మృతి పార్టీకి తీరనిలోటు

వర్గల్, మార్చి 15: కటికె కిషన్ మృతి పార్టీకి తీరని లోటని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కిషన్ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందగా శనివారం ఉదయం మృతుడి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజుతో కలిసి ఆయన పరామర్శించారు. అంతకుముందు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిషన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 15: ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అంబటి బాలచందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం కొండపాకలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండిపోతున్న పంటలను చూసి అసెంబ్లీలో మాట్లాడిన జగదీశ్‌రెడ్డి గొంతును నొక్కేందుకు సస్పెన్షన్ చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ కక్షపూరిత ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధిచెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో నాయకులు దొమ్మాట మహిపాల్‌రెడ్డి, దోమల దుర్గాప్రసాద్, కశరబోయిన కృష్ణమూర్తి, గ్రామ శాఖ అధ్యక్షుడు కాశిరెడ్డి మహిపాల్‌రెడ్డి, పసుల కుమార్, ముద్దాపురం భిక్షపతి, రమేశ్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి15: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన మద్దూరు మండలం మర్మాములలో చోటు చేసుకుంది. గ్రామంలోని రేషన్‌కార్డు లబ్ధిదారుల నుంచి గుర్తు తెలియని వ్యక్తి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి గ్రామంలోని ఉప్పల సుశీల అనే వృద్ధురాలి ఇంట్లో నిల్వ చేశాడు. సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇంట్లో సోదాలు నిర్వహించగా ఐదు క్వింటాళ్ల 50 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బియ్యాన్ని స్థానిక పోలీసులకు అప్పగించగా ఆర్ఐ రమేశ్ పంచనామా నిర్వహించి, బియ్యాన్ని స్థానిక రేషన్ డీలర్‌కు అప్పజెప్పారు.

చలివేంద్రం ప్రారంభం

చాట్లపల్లిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

జగదేవపూర్, మార్చి 15: మండలంలోని చాట్లపల్లిలో బీఆర్ఎస్ మండల నాయకుడు బరిగె భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కొండపోచమ్మ దేవాలయ మాజీ చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కావ్యాదుర్గయ్య ప్రారంభించారు. బాటసారులు, వాహనదారుల దప్పిక తీర్చేందుకు బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు యాదయ్య, కిష్టయ్య, ప్రభాకర్, శ్రీను, పోషయ్య, రాజు, గోక నర్సింహులు, కనకయ్య పాల్గొన్నారు.

నేడు మల్లన్న తొమ్మిదో ఆదివారం

చేర్యాల, మార్చి 15: కొమురవెల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు తొమ్మిదో ఆదివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోనున్నారు. ఈ ఆదివారం సుమారు 50 వేల మంది భక్తులు రానున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు మల్లన్నను దర్శించుకొని పట్నం వేసి బోనం సమర్పించుకోనున్నారు. మహామండపం, గంగరేగు చెట్టు ఆవరణలో పట్నాలు వేయనుండగా, మరికొందరు భక్తులు మల్లన్నగుట్ట పైన ఎల్లమ్మకు బోనం చేసి మొక్కులు చెల్లించుకోనున్నారు. మల్లన్న క్షేత్రంలో మొక్కుల అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు తరలి వెళ్లనున్నారు. భక్తుల కోసం ఆలయ ఈవో రామాంజనేయులు, పాలక మండలి అధికారులు, సిబ్బంది సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధన

జగదేవపూర్: మాట్లాడుతున్న డీఈవో

కొండపాక: అవగాహన కల్పిస్తున్న ఎంఈవో

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

జగదేవపూర్, మార్చి 15: విద్య పరంగా వెనుకబడిన విద్యార్థులకు సులభ పద్ధతిలో బోధన చేపట్టేందుకు ఏఐ కృత్రిమ మేధ దోహదపడుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వట్టిపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆయన ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన (ఏఐ) కృత్రిమ మేధ ల్యాబ్‌ను మండల విద్యాధికారి మాధవరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పేరెంట్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం కనకయ్య, పాఠశాల హెచ్ఎం సరోజ, ఏఏపీసీ అధ్యక్షులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 15: ఏఐ ఆధారిత బోధనతో విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని కుకునూరుపల్లి మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య అన్నారు. శనివారం మండలంలోని తిప్పారం ప్రాథమిక పాఠశాల,మంగోల్ ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు ఏఐ బోధన చక్కగా ఉపయోగపడుతుందన్నారు. స్థాయిని బట్టి బోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షాప్యాడ్లు పంపిణీ

పరీక్షాప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఎన్నారై చంద్రశేఖర్

చిన్నశంకరంపేట,మార్చి15: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఎన్నారై కంజర్ల చంద్రశేఖర్ సూచించారు. శనివారం చిన్నశంకరంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న 100మంది విద్యార్థులకు పరీక్షాప్యాడ్లతో పాటు పరీక్ష కిట్లను ఎన్నారై చంద్రశేఖర్ సౌజన్యంతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 10వ తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీమాన్‌స్వామి, నరేశ్, లింగం, శ్రీనివాస్‌స్వామి, రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

పాపన్నపేట,మార్చి15: గుండెపోటుతో మృతి చెందిన హోంగార్డు మహేందర్ కుటుంబానికి అతడి మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. పోలీసు విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గండెపోటుతో ఇటీవల మృతిచెందాడు. ఆయన తోటి మిత్రులు రూ.70.000రూపాయలు వారి కుటుంబానికి శనివారం అందించారు. కార్యక్రమంలో భరత్‌గౌడ్, శ్రీకాంత్,. అనిల్ ,రాకేశ్, శ్యామ్ , విఠల్ తదితరులు ఉన్నారు.

ఈఎస్ఐ, ఈపీఎఫ్ సొమ్ము స్వాహా

- రూ.14,85,364 నగదు వాడుకున్న ఏజెన్సీ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కొమురవెల్లి బుకింగ్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

చేర్యాల, మార్చి 15: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపాదికన ఉద్యోగం చేస్తున్న సిబ్బందికి సంబంధించిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ నగదును ఎంఎస్ హిమాన్స్ సీఆర్ఎం సర్వీసెస్ ఏజెన్సీ స్వాహా చేసింది. స్వామి వారి ఆలయానికి మ్యాన్ పవర్ సరఫరా చేస్తున్న సదరు సంస్థ రూ.14,85,364 సొమ్మును ప్రభుత్వానికి చెల్లించకుండా సొంతానికి వాడుకోవడంతో సిబ్బంది కొమురవెల్లి పోలీసులు శనివారం ఫిర్యాదు చేశారు. ఏజెన్సీ నిర్వాహకులు సెప్టెంబర్ 1, 2023 నుంచి ఆగస్టు 31,2025 వరకు రెండేండ్ల కాల పరిమితికి అగ్రిమెంట్ చేసుకుంది. కలెక్టర్ ఉత్తర్వులు, అగ్రిమెంట్‌లోని నిబంధనల ప్రకారం ప్రతి నెలా ఉద్యోగులకు ఈపీఎఫ్ 13శాతం, ఈఎస్ఐ 3.25 నగదను దేవస్థానం నుంచి పొంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఖాతాలో వేతనం మాత్రమే జమ చేసి ఈపీఎఫ్, ఈఎస్ఐ జమ చేయకుండా సొంతానికి వాడుకుంది. ఈపీఎఫ్, ఈఎస్ఐ వారివారి ఖాతాల్లో జమ చేయడంతో పాటు ట్యాక్స్ ఇన్‌వాయిస్‌ను దేవస్థానం కార్యాలయంలో ప్రతి నెలా సమర్పించాల్సి ఉంటుంది కానీ ఏజెన్సీ నిర్వాహకులు ప్రతి నెలా బిల్లులు పొంది ట్యాక్స్ ఇన్‌వాయిస్ బిల్లు సమర్పించలేదు. ఏజెన్సీ రూ. 11,88,800 ఈపీఎఫ్, రూ.2,90,564 ఈఎస్ఐ సిబ్బందికి సంబంధించిన ఖాతాల్లో జమ చేయలేదు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ ప్రభుత్వానికి చెల్లించకుండా ఎంఎస్ హిమాన్స్ సీఆర్ఎం సర్వీసెస్ సంస్థ సొంతానికి వాడుకుందని, సదరు సంస్థపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

జీఎస్టీ చెల్లించని ఏజెన్సీపై పోలీసులకు ఫిర్యాదు

చేర్యాల, మార్చి 15 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయానికి అవసరమైన మ్యాన్ పవర్ సరఫరా చేస్తున్న ఎంఎస్ హిమాన్స్ సీఆర్ఎం సర్వీసెస్ ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ రూ.14,11,291లను చెల్లింకపోవడంపై ఆలయ ఈవో రామాంజనేయులు శనివారం కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయం నుంచి జీఎస్టీ చెల్లించాల్సిన సొమ్ము తీసుకుని తమ సొంతానికి వాడుకున్న ఏజెన్సీపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వానికి జమ చేయకుండా ఉన్న జీఎస్టీ సొమ్ముకు సంబంధించి ఏజెన్సీకి సైతం షోకాజ్ నోటీసులు ఇచ్చినప్పటికీ సొమ్ము జమచేయలేదని ఫిర్యాదులో తెలిపారు.

ఆకట్టుకున్న నృత్యాలు

విద్యారణ్య ఆవాస విద్యాలయంలో మల్లకం విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, మార్చి 15: మండలంలోని తడ్కపల్లి విద్యారణ్య ఆవాస విద్యాలయంలో శనివారం 43వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, చిరుతల భజనలు, మల్లకం విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆవాస విద్యాలయం నిర్వాహకులు మాట్లాడారు. కార్యక్రమంలో విద్యారణ్య ఆవాస విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

గజ్వేల్‌లో మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

గజ్వేల్, మార్చి 15: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. న్యాయమైన హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సీఐ సైదా పాల్గొన్నారు.

బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి

హుస్నాబాద్‌లో నిర్వహించిన కాన్షీరామ్ జయంతిలో పాల్గొన్న బీఎస్పీనాయకులు

హుస్నాబాద్‌టౌన్, మార్చి 15: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని బీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మాట్లాడారు. బహుజనుల హక్కుల కోసం తనజీవితాన్ని త్యాగం చేసిన ఘనత కాన్షీరామ్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీనియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, పార్టీ నాయకులు సుధాకర్, శంకర్, రాజు, నీరజ, బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నిరేశ్

చేర్యాల, మార్చి 15: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నిరేశ్ అన్నారు. మండలంలోని తాడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పోలీసుల ఆధ్వర్యంలో మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, ఈవ్‌టీజింగ్, నూతన చట్టాలపై ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరమైన మేరకు మాత్రమే సోషల్ మీడియా ఉపయోగించాలని, చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దని సూచించారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, చట్టప్రకారం నేరమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరాములు, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, హెచ్‌సీ, పీసీలు ప్రశాంతి, కృష్ణ పాల్గొన్నారు.

'మల్లికార్జున' హుండీ ఆదాయం రూ.14.30 లక్షలు

దుబ్బాక, మార్చి 15: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని రేకులకుంట దేవాలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. జూన్ 2024 నుంచి శనివారం వరకు ఆలయంలో హుండీ ఆదాయం రూ. 14,30,405 వచ్చిందని దేవాలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఈ నగదును టీజీబీ దుబ్బాక శాఖలో జమ చేస్తామన్నారు. హుండీ లెక్కింపులో కుచాద్రి వేంకటేశ్వర స్వామి దేవాలయం, సిద్దిపేట కోటి లింగేశ్వరదేవాలయ అర్చకులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు రిమాండ్

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేట టౌన్, మార్చి 15: భార్యను హత్య చేసిన భర్తను సిద్దిపేట పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు టూటౌన్ సీఐ ఉపేందర్‌తో కలిసి ఏసీపీ మధు శనివారం వివరాలు వెల్లడించారు. బీహారు రాష్ట్రం తల్వార్బంధ గ్రామానికి చెందిన పెయింటర్ బలరామ్ హరిజన్ అదే రాష్ట్రానికి చెందిన బాలికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. బాలికను తల్లిదండ్రులకు తెలియకుండా బీహారు నుంచి సిద్దిపేటకు తీసుకువచ్చాడు. దక్కలకాలనీ మేర సంఘం భవనం వద్ద ఇల్లు కిరాయికి తీసుకొని కాపురం పెట్టాడు. హరిజన్ తరుచూ మద్యం తాగి వచ్చి భార్యను కొట్టేవాడు. గతనెల 14 రాత్రి బాగా తాగి వచ్చి భార్యతో ఘర్షణకు దిగాడు. ఆమె తలను గోడకేసి బాది గొంతుపిసికి చంపి మృతదేహాన్ని మేర సంఘం భవనం సంపులో పడేసి అదే రాత్రి బీహారుకు పారిపోయాడు. శనివారం ఇంట్లో సామగ్రి తీసుకువెళ్లేందుకు వచ్చి బలరామ్ హరిజన్ పోలీసులకు చిక్కాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా భార్యను చంపినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ తెలిపారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో

మిరుదొడ్డి, మార్చి 15: ప్రతి విద్యార్థికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎంఈవో ప్రవీణ్‌బాబు అన్నారు. శనివారం కొండాపూర్ జడ్పీ పాఠశాలలో ల్యాబ్ ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సుకన్య, ఉపాధ్యాయులు స్వప్నారెడ్డి, బుచ్చిరెడ్డి, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

జంగిటి కమలాకర్‌కు డాక్టరేట్

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 15: బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓయూ జేఏసీ నేత జంగిటి కమలాకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి శనివారం డాక్టరేట్ అందుకున్నారు. మద్దూరు మండలంలోని రేబర్తికి చెందిన ఆయన తన ప్రాథమిక విద్యను గ్రామంలోనే పూర్తి చేశాడు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీహెచ్‌డీలో చేరారు. 'ఛేంజింగ్ అర్బన్ గవర్నెన్స్ ఇన్ ఇండియా' అనే అంశంలో ప్రొఫెసర్ పార్థసారథి పర్యవేక్షణలో తన పరిశోధనను పూర్తి చేసి గ్రంథాన్ని సమర్పించారు. కమలాకర్ అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధన పత్రాలు సమర్పించి అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. డాక్టరేట్ అందుకున్న కమలాకర్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

మిరుదొడ్డి, మార్చి 15: అనారోగ్య సమస్యలతో చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో జరిగింది. మిరుదొడ్డి హెడ్ కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి టౌన్‌కు చెందిన మద్దెల నర్సవ్వ(80) కుమారుడు బాబుతో కలిసి జీవనం కొనసాగిస్తున్నది. ఇదే క్రమంలో నర్సవ్వకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. గత సంవత్సరం అనారోగ్య సమస్యలతో ఇంటి నుంచి వెళ్లి వారం రోజుల తర్వాత తిరిగి వచ్చింది. ఈనెల 14న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి శనివారం ఉదయం వరకు తిరిగి రాలేదు. వృద్ధురాలి మనువడు వెతుకుతున్న క్రమంలో పెద్ద చెరువులో మృతదేహం తేలింది. మృతురాలి కుమారుడు మద్దెల బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పెట్రోల్ బంక్ సిబ